క్లుప్తంగా

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలని లెట్స్ ఓట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే మాలకొండయ్య పేర్కొన్నారు. లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యం చాటుతూ గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి 12 కే సైక్లింగ్ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మాలకొండయ్య మాట్లాడుతూ చైతన్యవంతమైన గుంటూరు ప్రజలు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని గతంలో కంటే అత్యధికంగా పెంచేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యాన్ని చాటుతూ టీషర్ట్స్, టోపీలు ధరించి సైకిళ్లకు ప్లకార్డులు కట్టుకుని నగరంలోని వివిధ కూడళ్ల వద్ద ఓటర్లను చైతన్యపరిచారు. కార్యక్రమంలో లెట్స్ ఓట్ జిల్లా కన్వీనర్ బాలాజీ శ్రీనివాస్, బండ్లమూడి సుబ్బయ్య, డాక్టర్ పోసాని శ్రీనివాస్, డాక్టర్ రేపూరి హరికృష్ణ, రంజిత్ టైర్స్ రాజు, డాక్టర్ మద్దినేని సుధాకర్, రోటేరియన్స్ కేవీ భాస్కర్, సీతా రమేష్, రంగధామ్, బుల్లి కుమార్, సీఎస్ నాయుడు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



నెహ్రూనగర్: ఓటు మన ప్రాథమిక హక్కు అని, ఓటు వేయడం కనీస బాధ్యత అని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు రూరల్ ఏరియా కో ఆర్డినేటర్ వడ్డే రవితేజ పేర్కొన్నారు. గురువారం ఓబుల్‌నాయుడుపాలెం, డంపింగ్ యార్డు, అంబేడ్కర్ కాలనీలో ఉన్న వెస్ట్ పిక్కర్స్‌కు స్వేచ్ఛగా ఓటు వేద్దాం, సమర్థులను ఎన్నుకుందాం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, కమ్యూనిటీ లీడర్స్ చిరంజీవి పాల్గొన్నారు.

రోశయ్యను సత్కరించిన జైనులు



పట్నంబజారు: గుంటూరు నగరంలోని అమరావతి ఏ కన్వెన్షన్ హాలులోగురువారం జైనుల సామాజిక వర్గానికి సంబంధించి జరిగిన వర్క్‌షాప్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య హాజరయ్యారు. అనంతరం జైనుల పెద్దలు వారి మత సంప్రదాయంలో రోశయ్యను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ సేవా గుణానికి జైనులు పెట్టింది పేరని కొనియాడారు. మంచితనంతో ప్రతి ఒక్కరితో ముందుకు సాగుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



లక్ష్మీపురం: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం 'ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్‌లపై పోరు' అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమనేత పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అంతం చేసి భవిష్యత్తును కాపాడుకునే విషయంలో కొత్త అంతర్జాతీయ ఒడంబడిక నిమిత్తం గత వారం కెనడాలోని ఒట్టావాలో జరిగిన 192 దేశాల ప్రతినిధుల సమావేశంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిరోధించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తే పర్యావరణానికి పెను ప్రమాదమన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రచారకులు అమరాచారీ, సాయిబాబు పాల్గొన్నారు.

పశ్చిమలో 79.40 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కి దరఖాస్తు చేసుకున్న 4,361 మందిలో 3,463 మంది(79.40 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని గుంటూరు ఆదరపు కమిషనర్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి గురువారం తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ముగిసిందని చెప్పారు.

పండుటాకుల మోముల్లో చిరునవ్వే జగనన్న లక్ష్యం



ఐదో డివిజన్‌లో ఎన్నికల ప్రచారానికి ర్యాలీగా వెళ్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: పండుటాకుల మోముల్లో చిరునవ్వులు చూడాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్ రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రతి ఇంటి బిడ్డలా ప్రతినెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు.. ఆయా ఇంటి అన్నలా దివ్యాంగులు, వితంతువు మహిళలకు పక్కాగా పెన్షన్‌ను అందజేసి వారి కుటుంబాలకు ఎటువంటి కష్టం రాకుండా ఆదుకున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతొందన్నారు. రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న మద్దతు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని అభాండాలు మోపుతున్నాయని మండి పడ్డారు. చంద్రబాబు మరోసారి సిగ్గులేకుండా ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. అబద్ధాల మ్యానిఫెస్టోతో కుట్రల కూటమిని కలుపుకుని అధికారం కోసం అరులు చాస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చిన్నారుల భవిష్యత్తు దగ్గర్నుండి వృద్ధుల బాగోగుల వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వారికి మేలు చేసే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న తనను మీ ఇంటి బిడ్డగా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి, వైఎస్సార్ సీపీ నేతలు అశోక్, జీవన్, ఈసూబ్, గౌస్, మీరావలి, నూరుల్లా, రామయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

ఊసరవెల్లిని తలపించేలా చంద్రబాబు హామీలు

ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి



పార్టీలో చేరిన వారితో విప్ అప్పిరెడ్డి

పట్నంబజారు: చంద్రబాబు మేనిఫెస్టో హామీలు, కోటలు దాటుతున్న కూటమి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని, బాబును నమ్మితే ఊసరవెల్లిని తలపించేలా రంగులు మారుస్తారని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన 29వ డివిజన్‌లోని నల్లకుంటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. విప్ లేళ్ల అప్పిరెడ్డి సమక్షంలో గురువారం చేరారు. నల్లకుంటలోని భవనం బ్రహ్మారెడ్డి కాటన్ మిల్లులో స్థానిక కార్పొరేటర్ షేక్ రోషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో గోగుల వీరాంజి, వేముల గోపి, దేవళ్ళ రాజు, గోగుల వెంకట్, మేడిశెట్టి వంశీ, మాదుగుల చిన్నబాబు, మాదుగుల జోజిబాబు, నాగరాజుతో పాటు నల్లకుంటకు చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్యశాఖలో ఆయన ఓ జిల్లా అధికారి. వేసవిలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో వేసవి జాగ్రత్తల గురించి వైద్యులు, వైద్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వివరించటం ప్రథమ కర్తవ్యం. ఆయన ఒక పక్క విధులు నిర్వహిస్తూనే మరో పక్క సేవా కార్యక్రమానికి పూనుకున్నాడు. తన సొంత డబ్బులు వెచ్చించి తన కార్యాలయం ఎదురుగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆయనే ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్(డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కొండూరు సుబ్రహ్మణ్యరాజు. బుధవారం స్థానిక పట్టాభిపురంలోని వైద్య విధాన పరిషత్ కార్యాలయం ఎదుట సుమారు 500 మందికిపైగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. డాక్టర్ సుబ్రహ్మణ్యరాజుతోపాటుగా వైద్య విధాన పరిషత్ జిల్లా కార్యాలయ సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేసవి తాపం నుంచి రక్షణ కోసం, వడదెబ్బ తగలకుండా ప్రజలు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు తెలిపారు.

జీజీహెచ్‌లో 24 గంటలు కుక్క కాటుకు ఓపీ సేవలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: కుక్కకాటు బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో 24 గంటలు ఓపీ వైద్య సేవలు ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆస్పత్రి ఓపీ విభాగంలో కుక్కకాటుకు ఇంజక్షన్లు ఇచ్చే 14 బీ గదిని ఆయన పరిశీలించారు. కుక్క కాటు భాధితులు రోజుకు ఎంత మంది వస్తున్నారు, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లోని 14 ఓపి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు పాదిల ప్రసాద్ బ్లాక్‌లో కుక్కకాటు ఇంజక్షన్లు చేస్తారని చెప్పారు. ఒక్కొక్కసారి 50 నుంచి 100 మంది వరకు కుక్క కాటు బాధితులు వస్తున్నారని తెలిపారు. జీజీహెచ్‌కు ప్రతిరోజు కుక్కకాటు బాధితులు ఎంతమంది వస్తున్నారో వాటి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆన్ లైన్ లో పొందుపర్చాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కుక్క కరచిన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవాలని, వీధి కుక్కలు, పెంపుడు కుక్కల విషయం లో కూడా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కుక్క కాటు వల్ల రేబీస్ అనే ప్రాణాంతక జబ్బు వస్తుందని అది వస్తే మనిషి కి ప్రాణానికే ముప్పు వస్తుందని హెచ్చరించారు.

వీరుల చరిత్ర ముందు తరాలకు స్ఫూర్తి



ఇద్దరిని సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై గురువారం సాయంత్రం శ్రీ మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి నిర్వహించారు. గుంటూరు బొందిలి ఆధ్వర్యంలో వేడుకలు జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై మాట్లాడుతూ మహారాణా ప్రతాప్‌సింగ్ వంటి వీరుల చరిత్ర ముందు తరాలు తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామరాజు శ్రీనివాస్, ఏపీ బొందిలి సంఘం అధ్యక్షులు కె.శంకర్‌సింగ్, ఉపాధ్యక్షుడు క్షత్రి ధర్మనారాయణసింగ్, విశ్రాంత ఏఎస్పీ భూపాల్‌సింగ్, నూతలపాటి తిరుపతయ్య, మహీందర్ సింగ్, శిండే లక్ష్మీనారాయణ, కుమార్ శేఖర్ పాల్గొన్నారు. అనంతరం బొందిలి నిత్యశ్రీహర్షిణి, భువనశ్రీ (కర్నూల్)లను సత్కరించారు.

పోలింగ్‌కు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి



ఏసీ కాలేజీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు తూర్పులో సెక్టార్ అధికారుల వారీగా కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు ఏ సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ఏఈలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పీడీఎంఎస్ యాప్ వినియోగం, ఉదయం 5 గంటలకల్లా మాక్ పోలింగ్ జరిగేలా, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కార చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈఈ సుందర్రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో ఆయా ఏర్పాట్లను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా రిపోర్టింగ్ టీం, క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేస్తామని, పోలింగ్ సమయంలో శాంతి భద్రతలు, సాంకేతిక సమస్యలు ఎదురైనా తక్షణం రిటర్నింగ్ అధికారి టీం లేదా రిపోర్టింగ్ టీం దృష్టికి తీసుకువచ్చేలా పీఓలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు.

అనంతరం పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిణీ కేంద్రమైన ఏసీ కాలేజీని పరిశీలించి, పోలింగ్‌కు ముందు రోజు ఉదయం నుంచే పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. ఏసీ కాలేజీలో మెటీరియల్ పంపిణీకి అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలనిపట్టణ ప్రణాళిక అధికారులను, ఇతర సిబ్బందికి భోజన సదుపాయాలను అందించే వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని, సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఏఆర్ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామిరెడ్డి, సెక్టోరియల్ అధికారి బి.శ్రీధర్ బాబు, డీఈఈ రమేష్ బాబు, ఏసీపీ మురళి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎస్ఎస్ రాంబాబు, సూపరింటెండెంట్ పద్మనాభరావు, ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రి తానేటి వనితపై దాడి సిగ్గుచేటు

నెహ్రూనగర్: రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితపై టీడీపీ గుండాలు దాడి చేయడం సిగ్గుచేటని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ మాదిగ మహిళపై దాడి చేయడం మాదిగలపై దాడి జరిగినట్లుగానే భావిస్తున్నామన్నారు. అధికారంలోకి రాకముందే మాదిగలపై దాడులకు దిగితే ఇంకా అధికారంలోకి వస్తే ఎటువంటి పరిస్థితులు వస్తాయో అని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలంతా టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెహ్రూ నగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు తూర్పు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌ని 5 నుంచి 9వ తేదీ వరకు 2,949 మంది వినియోగించుకున్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి గురువారం తెలిపారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసి కాలేజి ఫెసిలిటేషన్ సెంటర్ లో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం ఇతర నియోజకవర్గాలతో కలపి 132 మంది పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకున్నారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌ని ఈ నెల 5వ తేదీ నుండి 9 వ తేదీ వరకు ఇతర నియోజకవర్గాలతో కలుపుకొని 3,143 మందికి గానూ 2949 మంది (93.83 శాతం) తమ ఓటుని వినియోగించుకున్నారని తెలిపారు. గురువారంతో పోస్టల్ బ్యాలెట్ ముగిసింది.

అమెరికన్ యూనివర్సిటీలతో ఏఎన్‌యూ ఎంఓయూ



ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు

ఏఎన్‌యూ: అమెరికాకు చెందిన టెక్సాస్ వెస్లియాన్ యూనివర్సిటీ, లెటర్నియో యూనివర్సిటీలతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. టెక్సస్ వెస్లీయాన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ కోఆర్డినేటర్ జూలిస్మిత్ బృందం గురువారం ఏఎన్‌యూని సందర్శించింది. యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని బృంద సభ్యులు సందర్శించారు. ఆ విభాగంలోని మౌలిక వసతులు, పరిశీలించారు. ఫార్మసి, ఫిజిక్స్, బుద్దిస్ట్ స్టడీస్ విభాగాలను సందర్శించి విదేశీ విద్యార్థులతో మాట్లాడారు. అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహం సందర్శించి సదుపాయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. అమెరికాలోని లెటర్నియో యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదవడానికి నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్న అవకాశాన్ని వివరించారు. విద్యార్థులు సగం కోర్సు ఏఎన్‌యూలోను మిగిలిన కోర్సును అమెరికా యూనివర్సిటీలో పూర్తి చేసుకునే వెసులుబాటు ఈ ఎంఓయూ ద్వారా అవకాశం ఉందని ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ ఎంవోయూ మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఎంఓయూలు ఎన్‌యూకి ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయ కుమార్ పాల్గొన్నారు.

జనం కోసం 130 సార్లు బటన్ నొక్కిన సీఎం జగన్



ప్రభుత్వ విప్ అప్పిరెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

పట్నంబజారు: మన అభివృద్ధి కోసం.. మన సంక్షేమం కోసం.. 130 సార్లు బటన్ నొక్కిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు రెండు సార్లు బటన్ నొక్కేందుకు రాష్ట్రవ్యాప్తంగా జనం సిద్ధమయ్యారని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరులో ఒక బటన్ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి విడదల రజినికి... రెండో బటన్ పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్యకు నొక్కి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారితో కలిసి లేళ్ల అప్పిరెడ్డి గడప గడపకు తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. లక్ష్మీనగర్‌లో జరిగిన సభలో లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, మరి కొన్ని రోజుల్లో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతుందన్నారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్యో లేక కొన్ని పార్టీల మధ్య జరుగుతున్న ఎన్నికలు కావనీ.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలను మాత్రమే ఎన్నుకునేందుకు జరగబోతున్న ఎన్నికలు కూడా కానే కాదన్నారు. పేదలకి పెత్తందార్లకు మధ్య జరగనున్న ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల మన ఇంటింటి అభివృద్ధిని, పథకాల కొనసాగింపును నిర్ణయించబోయే ఎన్నికలని చెప్పారు. ఈ ఎన్నికల్లో మీరు వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే ప్రతి గడపలో ప్రగతి, బంగారు భవిష్యత్తు, సంక్షేమ పథకాల కొనసాగింపు జరుగుతుందన్నారు. అదే పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికీ ముగింపు పలకడం ఖాయమన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విడదల రజిని ఎమ్మెల్యేగా చిలకలూరిపేట అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా తన సమర్థతను నిరూపించుకున్నారని లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగిన స్థానికుడైన కిలారి రోశయ్య ఎమ్మెల్యేగా పొన్నూరు సమగ్రాభివృద్ధికి కట్టుబడిన తీరు అందరికీ తెలిసిందేనని చెప్పారు. కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ పి.బాలిరెడ్డి, ఉపేంద్ర, కాశిరెడ్డి, కృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, బెంజి, చిన్నా, శంకర్ రెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, శ్రీను, శేఖర్, అనూరాధ, నాగలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలు నమ్మే దుస్థితి లేదు

లక్ష్మీపురం: టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ముస్లిం యునైటెడ్, ముస్లిం జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ కలీం అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన ముస్లిం మేధో మథన సదస్సులో ముస్లింలకు నాలుగు శాతం రాజకీయ రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తామని ఆ పార్టీ అధినేత ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవవేర్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన ఎన్నికల్లో 175 స్థానాలకు నాలుగు శాతం చొప్పున ఏడు అసెంబ్లీ స్థానాలు ఒక పార్లమెంట్ స్థానం ఇవ్వవలసి ఉండగా. 2014లో ఒక సీటు 2019లో నాలుగు సీట్లు 2024 లో మూడు సీట్లు అసెంబ్లీ సీట్లు మాత్రమే ఇచ్చిన పార్టీ నాలుగు శాతం రిజర్వేషన్లు కాపాడుతామని చెపితే నమ్మే అంత అమాయకులు లేరని అన్నారు. తెలుగు దేశం పార్టీ బీజేపి పార్టీతో పొత్తు పెట్టుకున్నప్పుడు ముస్లిం సమాజం తెలుగు దేశం పార్టీకి పూర్తిగా దూరం అయ్యారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు చంద్రబాబు చెప్పే మోస పూరిత మాటలను నమ్మే స్థితిలో లేరని అన్నారు. ముస్లింలపై దేశ వ్యాప్తంగా జరుగుతున్న దాడులపై ఈనెల 13న ఆయుధం అనే ఓటుతో తగిన గుణపాఠం చెప్పడం తథ్యం అన్నారు.

ఓటరూ మేలుకో... ఓటు వేసి బాధ్యత పెంచుకో

- గుంటూరు పశ్చిమలో పోలింగ్ శాతం అత్యల్పం
- గత ఎన్నికల్లో 65.7 శాతం నమోదు
- ఓటు హక్కు వినియోగంపై ఆసక్తి చూపని నగరవాసులు
- ఓటర్ల సంఖ్య 2,78,158
- పురుషులను అధిగమించి పైచేయి సాధించిన మహిళా ఓటర్లు



గత నెల 27న గుంటూరులో ఓటు హక్కుపై చైతన్య పరుస్తూ 3కే వాక్

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల పండుగొచ్చింది. దేశంలో సందడి నెలకొంది. పల్లె నుంచి పట్టణం వరకు పిల్లాపాపల నుంచి వృద్ధుల వరకు ఎన్నికలు ఓ ఉత్సాహాన్ని నింపుతాయి. అలాంటి ఎన్నికలపై పట్టణ వాసులు కినుక వహించడం ఆందోళన కలిగిస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంలో నగర ఓటర్లు వెనుకడుగువేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటింగ్ 65.7 శాతానికి పరిమితం కావడం ఇందుకు నిదర్శనం. అంటే ఈ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ప్రతి వంద మంది ఓటర్లలో 65 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 35 మంది గడప దాటలేదు. విద్యావంతుల నిలయంగా, గుంటూరు జిల్లా కేంద్రంగా ఉన్న పశ్చిమ నియోజకవర్గం విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందింది. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన నియోజకవర్గం ఓటింగ్‌లో మాత్రం రాష్ట్రస్థాయిలో వెనుకబాటుకు గురవుతోంది. విద్యాపరంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన నియోజకవర్గం వ్యాపార కేంద్రంగాను విరాజిల్లుతోంది. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నగర ఓటర్లు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని గుర్తెరిగి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేస్తోంది.

సంవత్సరం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
2019	1,31,526	1,37,638	54	2,69,218
2024	1,35,426	1,42,688	44	2,78,158

పోలింగ్ 65.7 శాతానికి పరిమితం..

2019 ఏప్రిల్ 11న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో 65.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,65,135 మంది ఓటర్లలో 1,74,147 మంది ఓటనర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన 90,988 మంది ఓటు వేసేందుకు గడప దాటలేదు.

పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

నగరంలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఓటరన్లు చైతన్యపర్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే దిశగా చైతన్యపరుస్తున్నాయి. ఇందులో భాగంగా తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతను చైతన్యపరుస్తూ గత నెల 27న బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఓటర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని చాటుతూ నిర్వహించిన 3కే వాక్‌లో వందలాదిగా ప్రజలు, యువతీ, యువకులు పాల్గొన్నారు.